సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం



ఎల్‌వోసీ అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం ప్రాంతానికి చెందిన దుంపల భాస్కర్‌రావుకు రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. ఆ చెక్కును మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

జీడిమెట్ల: వివిధ అసోసియేషన్‌ల సభ్యులతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు మంగళవారం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ను కలిశారు. 12న కుత్బుల్లాపూర్ మండల ప్రభుత్వ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టీచర్స్‌డే కార్యక్రమానికి హాజరవ్వాలని ఎంఈవో జెమినికుమారి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. అదేవిధంగా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూరారంలోని వీఐపీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న టీచర్స్‌డే కార్యక్రమానికి హాజరు కావాలని ప్రతినిధులు కోరారు. రామేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటేష్, వినోద్, దయాకర్, బాలరాజు, శ్రీశైలం, సంగీత, పద్మ, మహేందర్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఊరేగింపులో అపశృతి

కుత్బుల్లాపూర్: వినాయక నిమజ్జన వేడుకల్లో పేల్చిన టపాసులు మీద పడటంతో ఓ మహిళ, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లిలోని ముదిరాజ్ బస్తీలో సోమవారం రాత్రి వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపు జరిగింది. టపాసులు పేల్చారు. ఈ క్రమంలో విజయ అనే మహిళపై టపాసులు పడటంతో ఆమె ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను హర్ష ఆస్పత్రిలో చేర్పించారు. గాయపడ్డ మరో వ్యక్తిని కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాళోజీ రచనలు స్ఫూర్తిదాయకం

- ఘనంగా జయంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించిన అధికారులు



రాష్ట్రపతి నిలయంలో .. సూరారం నార్త్‌సిటీ హైస్కూల్ విద్యార్థులు



కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి, సిబ్బంది

కుత్బుల్లాపూర్: కాళోజీ తన కలంతో ఎన్నో కవితలు రాసి ప్రజలను, యువకులను ప్రభావితం చేసిన గొప్ప కవి అని వక్తలు అన్నారు. మంగళవారం కాళోజీ జయంతి సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. తెలంగాణ మాండలికంలో రచనలు చేస్తూ తెలంగాణ ప్రజలను సామాజికంగా మేల్కొల్పిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని అన్నారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతో గౌరవించిందన్నారు. ఆయన రచనలు స్ఫూర్తిదాయకంగా ఉంటాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో .. కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్, అధికారులు



మల్లారెడ్డినగర్‌లో నివాళులర్పిస్తున్న గాజులరామారం బీఆర్‌ఎస్ నాయకులు



ఎస్ఆర్ నాయక్‌నగర్ టీవీఆర్ స్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎస్సీల సంక్షేమానికి నిరంతరం కృషి



క్రాంతి కిరణ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: పార్టీ అభివృద్ధి, ఎస్సీల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆత్మకూరి క్రాంతి కిరణ్ అన్నారు. ఎన్నికైన సందర్భంగా పలువురు మంగళవారం ఆయనను సన్మానించారు. క్రాంతి కిరణ్ ఏబీవీపీ కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండు సార్లు పని చేశారు. రాష్ట్రంలో షెడ్యూల్ కులాల్లో ఏ సమస్య వచ్చినా పరిష్కారం కోసం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తానని అన్నారు. కార్యక్రమంలో దాసి నాగరాజు, కొండ్రు పురుషోత్తం ప్రకాష్, కిరణ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాధవిని సన్మానిస్తున్న మంగమ్మ

సన్మానం

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులైన కొల్లి మాధవిని బాచుపల్లిలో మంగళవారం నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌లపై ఫిర్యాదు

సుభాష్‌నగర్: రోడ్డుపై రాకపోకలకు ఆటంకం సృష్టిస్తున్న బోర్ వాహన యజమానులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం జగద్గిరిగుట్ట పోలీసులకు మహదేవపురం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. కాలనీ అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో అంతర్గత రోడ్లపై సుమారు 40కి పైగా బోరు వాహనాల యజమానులు అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారన్నారు. సంబంధిత వాహనాలపై పనిచేసే వర్కర్లు రాత్రి వేళలో మద్యం సేవించి ఇల్లు కట్టుకుంటున్న వారితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని సీఐ నరసింహకు వివరించారు. కార్యక్రమంలో కాలనీ జనరల్ సెక్రటరీ ప్రసాద్ దుగ్యాల, రామచంద్రారెడ్డి, దిలీప్ కుమార్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



వీధి కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, వెటర్నరీ డాక్టర్ శైలజ

దుండిగల్: 100 రోజుల ప్రణాళికలో భాగంగా బ్లూ క్రాస్ సొసైటీ భాగస్వామ్యంతో వీధి, పెంపుడు కుక్కలకు పెద్ద ఎత్తున ఉచిత వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించారు. మంగళవారం దుండిగల్ వార్డు కార్యాలయం వద్ద క్యాంపు నిర్వహించారు. దుండిగల్ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మంగళవారం ఒక్క రోజే 264 వీధి, పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ వేయించారు. అదే విధంగా 21 వీధి కుక్కలను స్టెరిలైజేషన్ ఆపరేషన్ కోసం ఏబీసీ కేంద్రానికి తరలించారు. ఇప్పటివరకు మున్సిపాలిటీలో 2159 కుక్కలకు స్టెరిలైజేషన్, యాంటీ రేబిస్ టీకాలు వేయించామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ తెలిపారు. దుండిగల్ వెటర్నరీ డాక్టర్ శైలజ, బ్లూ క్రాస్ సొసైటీ షెల్టర్ డైరెక్టర్ ఆర్ ఎస్‌కె కుమారి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని మంత్రికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న బండి శ్రీనివాస్‌గౌడ్

జగద్గిరిగుట్ట: షెడ్యూల్ కులాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ కుత్బుల్లాపూర్– ఏ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఎస్సీల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. దివ్యాంగులు, వృద్ధులు, ఆసరా పెన్షన్ల కోసం చాలామంది దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారని తెలిపారు. జీడిమెట్ల డివిజన్‌ను ప్రత్యేక అధికారిని నియమించి పెన్షన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో పూర్ణచందర్ తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చొద్దు



విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ కృష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాల్చడం నిషేధమని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాల్చడం నిషేధంపై ప్రభుత్వ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చడం వల్ల వచ్చే అనర్థాలను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణ, మున్సిపల్ డిప్యూటీ ఈఈ తిరుపతి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.జానీ, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రాఘవాచారి, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొనారు.